క్లుప్తంగా

మామిడి మొక్కలు నాటిన ఈవో, చైర్మన్



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి మునేరు అవతల పాపమాంబ వనంలో శుక్రవారం ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు మామిడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు తోటలో చెట్ల కింద సేద తీరేందుకు తోటలో ఖాళీగా ఉన్న స్థలంలో 50 మామిడి మొక్కలు నాటించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి దర్శనానికి శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వేసవి సెలవులతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలతో పాటు క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని సాయంత్రం వరకు మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా శుక్ర, ఆదివారాలు ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ డైరెక్టర్ కాకాని అలేఖ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటర్ సరే.. సిబ్బంది ఏరీ?



పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మవారి ఆలయ రాజగోపురం ముందు ఏర్పాటు చేసిన కౌంటర్ శుక్రవారం సిబ్బంది ఎవరూ లేకుండా ఖాళీగా ఉండటంపై కొందరు భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆలయం లోపల లడ్డూ ప్రసాదాలు తీసుకోవటం మరిచిపోతే, సౌకర్యంగా ఉండేందుకు, శీఘ్రదర్శనం టికెట్ రూ.200 ఇచ్చేందుకు కౌంటర్ ఏర్పాటు చేశారు. అయితే అవి ఇచ్చేందుకు సిబ్బంది ఎవరూ లేరు. భక్తులు ఎక్కువగా ఉండే శుక్ర, ఆదివారాల్లో అయినా సిబ్బంది ఖచ్చితంగా ఉండేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

ముక్తేశ్వరునికి వెండి బిందె సమర్పణ



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న భవాని ముక్తేశ్వరునికి ఓ భక్తుడు వెండి బిందెను శుక్రువారం ఆలయ ఇన్‌చార్జ్ ఈవో కె.సురేష్‌బాబుకు అందజేశారు. మండలంలోని గౌరవరం గ్రామానికి చెందిన భక్తుడు మైనేని గోవర్ధనరావు 104 గ్రాముల వెండి బిందెను స్వామివారి నిత్య కైంకర్యముల నిమిత్తం వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సాంబశివరావు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు ఆక్రమణల పరిశీలన



విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లి రోడ్డులోని పెద్ద చెరువు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో శుక్రవారం అధికారులు పరిశీలించారు. సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలు గుర్తిస్తామని తహసీల్దారు లక్ష్మీ కల్యాణి తెలిపారు. మండలంలోని కొండపర్వలో కూడా ఎటువంటి అనుమతులు లేకుండా సప్లయ్ చానల్ ఆక్రమించి తూరలు వేసి రహదారి ఏర్పాటు చేసుకున్నట్లు కూడా ఫిర్యాదులు అందడంతో అధికారులు పరిశీలించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు. ఎంపీడీఓ చిన రాట్నాలు, ఆర్ అండ్ బీ జేఈ గాయత్రి పాల్గొన్నారు.

గోవుల గ్రాసంపై నిర్లక్ష్యం





పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి గోశాల వద్ద సగం తడిసిపోయిన వరిగడ్డి ; తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ గోశాల వద్ద తడిసిన వరిగడ్డి

- గోశాలలో పనికి రాకుండా పోతున్న వరిగడ్డి
- దాతల సాయంపై అధికారుల నిర్లక్ష్యం
- రక్షణ లేకపోవటంతో కుళ్లిపోతున్న వరిగడ్డి నిల్వలు

జగ్గయ్యపేట: ఆలయాల పరిధిలోని గోశాలలకు భక్తులు ఇస్తున్న వరిగడ్డి జాగ్రత్త చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో పశుగ్రాసం నిరుపయోగమవుతోంది.

విషయం ఇదీ..

నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలులోని గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయం , తిరుమలగిరిలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలలోని గోశాలలకు భక్తులు విరాళంగా ఇచ్చిన వరిగడ్డి రక్షణ లేకపోవటంతో పనికి రాకుండా పోతోంది.

88 గోవుల కోసం..

తిరుపతమ్మ అమ్మవారి ఆలయ పరిధిలోని గోశాలలో 80 గోవులు, తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలోని గోశాలలో ఎనిమిది గోవులు ఉన్నాయి. గోశాలలోని గోవులకు ప్రతి ఏటా ఈ ప్రాంతంలోని రైతులతో పాటు పక్క రాష్ట్రాలకు చెందిన రైతులు కూడా రూ.లక్షలు వెచ్చించి పశుగ్రాసాన్ని విరాళంగా అందిస్తున్నారు. ఈ గ్రాసాన్ని ఆరుబయట పెట్టటంతో పాటు కనీసం రక్షణ చర్యలు చేపట్టకపోవటంతో వర్షాలకు తడిచి కుళ్లిపోతోంది. ఆలయాలకు ఏటా రూ.కోట్ల ఆదాయం వస్తున్నా గోశాలలకు మాత్రం ఖర్చు చేయటం లేదని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు చేపట్టాలి..

దాతల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉంద. పరిస్థితిని పరిశీలించి ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి ఆయా ఆలయాలకు చెందిన గోశాలల పశుగ్రాసం పాడవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చండి సారూ!



గండేపల్లి నుంచి కీసర వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డుపై గుంతలు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి నుంచి కీసర నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఆ గోతుల్లో పడి తీవ్రగాయా లపాలవుతున్నారు. ఆ గోతుల్లో బైక్‌లు, ఆటోలు కూడా పల్టీ కొడుతున్నాయి. ఇక రాత్రి సమయంలో వాహనదారుల పరిస్థితి వర్ణణాతీతం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని గ్రామాల్లో రోడ్లను ఎంతో అభివృద్ధి చేస్తామన్న పాలకులకు ఈ రోడ్డు దుస్థితి కనిపించటం లేదా అని ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. గండేపల్లిలో సెంటినీ కర్మాగారానికి ఇతర ప్రాంతాల నుంచి పెద్ద పెద్ద వాహనాలు వస్తుంటాయి. ఆ వాహనాల వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిందని ప్రజలు అంటున్నారు. చిన్న పాటి వర్షం కురిస్తే చాలు రోడ్డుపై మోకాలు లోతు నీరు నిలబడి పోతోంది. ఆ రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు పారుదల అయ్యేందుకు కనీసం రోడ్డు పక్కన డ్రెయినేజీ కూడా లేదు. కొంత మంది వ్యక్తులు రోడ్డు మార్జిన్ ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు లేకపోవటంతో వర్షపునీరంతా రోడ్డుపైనే నిల్వ ఉండి పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి రోడ్డుపై పడిన గోతులను పూడ్చాలని, పూర్తి స్థాయిలో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన న్యాయవాదులు



అదనపు జిల్లా న్యాయమూర్తి బాబూనాయక్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

నందిగామ టౌన్: ఉమ్మడి కృష్ణాజిల్లా 10వ అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు న్యాయమూర్తి బాబూనాయక్‌ను నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నందిగామ సీనియర్ సివిల్ కోర్టుకు వెకేషన్ కోర్టు ఇన్‌చార్జ్‌గా ఆయన నియమితులయ్యారు. దీంతో మాజీ ఏపీపీ ఈశ్వరప్రగడ రంగారావు, పింగళి లక్ష్మీ నరసింహారావు, మాజీ ఏజీపీ మట్టా ప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబులు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు స్వామి, రామచంద్రారెడ్డి, సైదా, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మఠం శివాలయం నిర్మాణానికి విరాళం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పాలేటి నది తీరాన వేంచేసియున్న శివ పంచాయతన క్షేత్రం మఠం శివాలయం సంపూర్ణ కృష్ణ శిలలతో పునర్నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు అందజేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం భక్తులు చేడె నాగేశ్వరరావు, చేడె జనార్ధనరావు, చేడె వెంకటేశ్వరరావు సంయుక్తంగా ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష 16 వేలను విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు విరాళం నగదును అందజేశారు.



ఇసుక టిప్పర్ బోల్తా



చందర్లపాడు(నందిగామ టౌన్): గొర్రెల మంద అడ్డురావటంతో అదుపు తప్పి ఇసుక టిప్పర్ బోల్తా పడింది. సేకరించిన సమాచారం మేరకు చందర్లపాడు వైపు నుంచి శుక్రవారం ఇసుక లోడుతో టిప్పర్ నందిగామ వైపు వస్తోంది. ఈ క్రమంలో ముప్పాళ్ల సమీపంలోకి వచ్చే సరికి గొర్రెల మంద అడ్డురావటంతో టిప్పర్ అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. అప్రమత్తమైన డ్రైవర్ టిప్పర్‌లో నుంచి దూకేయటంతో ఎటువంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న చందర్లపాడు ఎస్ఐ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోరు పంపు ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, నాయకులు

నందిగామ రూరల్: పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని ఎనిమిదవ వార్డు పరిధిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోరుపంపు నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.మూడు కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా తాగు, వాడుక నీటికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యురాలు శాఖమూరు స్వర్ణలత, నాయకులు రాము, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్థిరమైన జీవితానికి విద్య దోహదం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి

కొళ్లికూళ్ల(పెనుగంచిప్రోలు): స్థిరమైన, సంతోషకరమైన జీవితానికి విద్య దోహదం చేస్తుందని ఐసీడీఎస్ నవాబుపేట సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. కిశోర వికాసం శిక్షణ కార్యక్రమంలో భాగంగా నవాబుపేట సెక్టార్ పరిధిలోని కొళ్లికూళ్ల గ్రామంలో బాలికలు, తల్లులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక ఎదుగుదలకు విద్య అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీతారావమ్మ, విజయలక్ష్మి, హెల్పర్ లత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని ఫిర్యాదు



తహసీల్దార్‌కు పెట్రోల్ పోయించిన బాటిల్స్‌ను చూపిస్తున్న యువకులు

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు అవతల పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయిస్తే నీళ్లు వస్తున్నాయంటూ గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం తహసీల్దార్ శాంతిలక్ష్మికి ఫిర్యాదు చేశారు. నీళ్లు కలిసిన పెట్రోల్ పోయటం వలన తమ బైక్‌లు పాడయ్యాయని యువకులు అంటున్నారు. దీనిపై బంక్ నిర్వాహకులను అడిగితే సరైన సమాధానం ఇవ్వటం లేదన్నారు. ఫిర్యాదుపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

చెత్త సేకరణతో సంపద సృష్టించాలి

డీఎల్‌పీఓ లావణ్యకుమారి



ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్పీఓ లావణ్య కుమారి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించడం ద్వారా చెత్త వ్యర్థాల నుంచి ఎరువులు తయారు చేసి సంపద సృష్టించాలని విజయవాడ డీఎల్‌పీఓ లావణ్యకుమారి అన్నారు. కేతనకొండ గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. వర్మికంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. వ్యవసాయ భూముల్లో వర్మికంపోస్ట్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగుగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలపై సర్పంచులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి నళినీ ఆశాలత, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్‌కుమార్, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తిరువూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. తిరువూరు సీపీఐ నియోజకవర్గ సమితి రెండో మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే చదువుకునే విద్యార్థులందరికీ తల్లికి వందనం కింద ఆర్థిక సాయం అందజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని, రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం ఏమైందని ప్రశ్నించారు. 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు మహిళలందరికీ ఏడాదికి రూ.1500 ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ఎప్పుడు నెరవేరుస్తారో వారికే తెలియడం లేదని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం, సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇస్తామన్న ఇళ్లస్థలాలకు ఎప్పటికి మోక్షం కలుగుతుందో అర్థం కావడంలేదన్నారు. తిరువూరులో 1,530 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని, గతంలో చేపట్టిన పక్కా గృహాల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో చేరి తన సొంత అజెండాను పూర్తిగా పక్కన పడేశారని ఎద్దేవా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని, సీపీఐ జిల్లా నాయకులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, షేక్ నాగుల్‌మీరా, రాయప్ప, పసుపులేటి వెంకయ్య, మేకల డేవిడ్, సుబానీ, వెంకట్రావు, త్యాగరాజు, వనమాలి, రామకృష్ణ, రవి పాల్గొన్నారు. తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యదర్శిగా షేక్ నాగుల్‌మీరాను, మరో 29 మంది కమిటీ సభ్యులను ఈ మహాసభలో ఎన్నుకున్నారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

తిరువూరు: సరస్వతీ నది పుష్కరాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తిరువూరు డిపో నుంచి ఈ నెల 24, 25 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తెలిపారు. రెండు రోజులూ రాత్రి 9 గంటలకు తిరువూరు బస్టాండ్‌లో బస్సు బయల్దేరి ఖమ్మం, మహబూబాబాద్, భూపాల్‌పల్లి మీదుగా కాళేశ్వరం చేరతుందన్నారు. అంతర్వాహినిగా ఉన్న సరస్వతీ నదిలో పుష్కర స్నానానంతరం మహాకాళేశ్వరుని దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణం ఉదయం 9 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. రానుపోను ఒక్కొక్కరికి రూ.1,100 టికెట్ ధర నిర్ణయించామని, ఆన్‌లైన్‌లో ముందుగా టికెట్ బుక్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. సర్వీస్ నెంబరు 35036తో ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు.వివరాలకు సెల్: 73824 87969, 98856 61835లలో సంప్రదించాలని కోరారు.

మద్యం దుకాణాల తనిఖీ

జగ్గయ్యపేట: మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఎక్సైజ్ సీఐ బి.గురవయ్య పేర్కొన్నారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేట పట్టణంలోని మద్యం దుకాణాలను శుక్రువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా మద్యం దుకాణాల్లో స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందరు మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తే లైసెన్స్ రద్దుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్ట్ షాపులకు మద్యం విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి కల్యాణం

వీరులపాడు: మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామి వారికి ప్రత్యేకాలంకరణలు, విశేష పూజలు చేశారు. గురువారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అగస్త్య పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తల్లపురెడ్డి రామ్మోహన్ రెడ్డి, అప్పిరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన



ఇబ్రహీంపట్నం: ట్రాఫిక్ నియమ నిబంధనలపై ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులకు ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ ట్రాక్టర్‌లు నడపరాదన్నారు. అతివేగంతో ట్రాక్టర్ నడపడం వలన అత్యవసర పరిస్థితిలో ట్రాక్టర్‌ను ఆపడం సాధ్యం కాదని ఎస్ఐ చెప్పారు. ప్రమాదం సంభవిస్తే తీవ్రమైన నష్టం జరుగుతుందని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో నడిపే వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించుకోవాలన్నారు. రహదారుల పక్కన ట్రాక్టర్లు ఎట్టి పరిస్థితిల్లో పార్కింగ్ చేయకూడదన్నారు. వాహనాలు రోడ్డెక్కే సమయంలో బండి రికార్డులతో పాటు డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. యజమానులు లైసెన్స్ ఉన్న డ్రైవర్లకే ట్రాక్టర్లను అప్పగించాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌కు డస్ట్‌బిన్‌ల వితరణ



నూజివీడు: పట్టణానికి చెందిన దంత వైద్యులు దేవిశెట్టి దినేష్ స్థానిక ఆర్టీసీ బస్టాండులో పరిశుభ్రత కోసం డస్ట్‌బిన్లను వితరణగా శుక్రవారం అందజేశారు. 12 పెద్ద డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసినందుకు డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు అందజేశారని, ఇప్పుడు డస్ట్‌బిన్లు అందజేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ దినేష్ మాట్లాడుతూ బస్టాండు ఆవరణను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రయాణికులపై ఉందన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు అనంతలక్ష్మి, సభ్యులు కొప్పోలు రంగారావు, కోలేటి తిరుపతిరావు, ఆర్టీసీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగా గురువు లంకే జనార్దన్ అన్నారు. యోగాంధ్రలో భాగంగా కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు యోగా, ధ్యానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారు యోగా ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన మాట్లాడుతూ జూన్ 21 వరకు మున్సిపాల్టీ పరిధిలోని ఐదు ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. డ్వాక్రా మహిళలతో యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం చేయించారు. ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.